నండీ. అమ్మగారికి పాలుపోసే వాడిని! అయ్యగారు రోజూ నాలుగ్గంటలకి తలుపుతెరిచి పాలు తీసుకొనేవారు. ఇవాళేమో అమ్మగారలా ఎందుకో భయపడ్డారు!" అని వాడు మొత్తుకొన్నాడు. అప్పటికి కమలకు తెల్లవారి నాలుగు గంటలైందని తెలిసింది. ఎప్పుడూ పాల రంగన్న నాలుగ్గంటలకు పాలుతెస్తే తను లేచేముందే రామం వాటిని గిన్నెలో పోయించుకునేవాడు. కమల సిగ్గుపడిపోయింది. రామం పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వాడు. అందరూ నవ్వుతున్నారు.

ఆ మర్నాడు కమల కాగితం కలం తీసి ప్రమీలకు ఉత్తరం వ్రాస్తూ, తెలుగుక్లాసు ప్రతిజ్ఞలో తాను ఓడిపోయిందని వ్రాస్తోంది. రామం ఆదివారం కాబట్టి ఇంట్లోనే ఉన్నాడు. దొంగ కృష్ణుడులా కమల వెనుకనుంచి రామం ఉత్తరం అంతా చదివి గట్టిగా—

పొలయలుకల్ వహించి వలపుల్ మొలిపించు పిసాళిగబ్బిగు
బ్బల జవరాండ్ర మైగగురుపాటున నేటికి వచ్చెనమ్మ తా
బిలువని పేరటంబనుచు బెగ్గిలి నాథుల కౌగలింపగా
బొలుపుగ నందు పెండ్లి నడుపుల్ నడుపున్ చోరు నాగమనపుల్!

అని కడపటి పదాన్ని గట్టిగా నొక్కి పలికాడు. తాను ఓడిపోయినందుకు సంతోషంతో కమల కిలకిలా నవ్వింది హాయిగా.

---

స్కెచ్

# పడమటి కొండలు

యేర్లగడ్డ శివరామకృష్ణ

గూట్లో కోడిపుంజు నిద్రమేలుకుంది. బయటకు దృష్టి సారించింది. బలంగా చలిగాలీ — హోరుగా వానా; కూద్దామనుకున్న కోడిపుంజు బద్ధకించి రెక్కలు యింకా ముడుచుకుని గూటి మూలకు చేరి పడుకున్నది.

ఆ పట్టణం అర్ధయామున నిద్రపోతోంది. వానా చలిగాలీ... వెచ్చగా హాయిగా నిద్రపోతోంది. ఆ 'వెచ్చగా' 'హాయిగా' అనేవి మేడల్లోనూ, మంచి వసతైన చోట్లల్లోనూ పేరుకుపోయాయి. ధర్మసత్రాలూ, రైలుస్టేషను హాల్లూ, ఇళ్ళపంచలూ, జీర్ణమైన యిళ్ళూ గజగజా వొణికిపోతూనే వున్నాయి. ఇటువంటి స్థలాల్లో ఉండటానికి భయం కలిగి 'వెచ్చదనమూ' 'హాయీ' మేడల్లోనూ వసతైన చోట్లల్లోనూ తల దాచుకున్నాయి.

ఆ సమయాన ఊరుకు చివర గజగజా వొణికిపోతోన్న పూరింట్లోంచి బాధాకరంగా మూలుగు వినిపిస్తోంది. ఆ గదిలోనుంచే ఆ మూలుగుకి అనునయ స్వరాలుగూడా వినిపిస్తున్నవి.

మూలుగు వొక్కసారి పెద్దదైంది. "అమ్మా! అబ్బా" అంటూ. ఆ తరువాత "క్యార్! క్యార్!" అంటూ పసిగొంతు యేడుపు వినిపించింది. ఆ శబ్దానికి గదవతల కుక్కి మంచంలో జారగిలబడి పలవరిస్తూ నిద్రపోతోన్న ఓ ఆకారం ఉలిక్కిపడి లేచి కూచుంది.

అటూ యిటూ కలయజూసింది. ఆ మంచానికి అటూ యిటూ నేలమీద చిన్నా పెద్దా సైజుల్లో పదమూడు ఆకారాలు డొక్కల్లో కాళ్లుపెట్టుకుని అటూ యిటూ మసలుతూ నిద్రపోతున్నాయి.

కుక్కి మంచంలో లేచి కూచున్న ఆకారం క్రిందపడుకున్న ఆకారాలవంక చూసి మళ్ళీ గది వైపుచూసి "పద్ధాలుగు" అని పెద్దగా అని తల మీద చెయ్యివేసుకుంది.

ఇంతలో గదిలోనుంచి ఓ కంఠం బిగ్గరగా "ఏవయ్యోయ్! నీనిద్ర పాడుగాను! పోయిందయ్యా పెద్దప్రాణం. ఇదిగో యీ రాక్షసి పుట్టి, నీ మనిషి పొట్టను బెట్టుకుంది" అని అరిచింది.

కుక్కిమంచంలోని ఆకారం ఉలిక్కిపడి లేచి

నిల్చుని ఒక్క ఉదుటున గదిలోకి పోయింది. ఒక్కసారిగా అవురుమంది.

అయిదు నిముషాలకల్లా ఆ ఆకారం గదిలో నించి బయటకు వొచ్చి గబగబా బజారున పడింది.

* * *

అప్పటికి వాన తగ్గింది. గాలి యెక్కువైంది. మబ్బులు చెదిరిపోయినై. పట్టణం అప్పుడే బద్ధకంగా నిద్రలేచింది.

కాసేపటికి వెలుగు రావటం మొదలుపెట్టింది. ఇప్పుడు మనం యిందాకటినుంచీ అనుకుంటున్న ఆకారం స్పష్టంగా కనపడుతోంది.

ఆ ఆకారం మనిషి ఆకారంలోనే వుంది. కాదు అతను మనిషనటానికి వీలుగానే వున్నాడు. అతనికి నలభై అయిదేళ్ళుంటాయి. కాని ఎనభై అయిదేళ్ళ చర్మం కప్పుకున్నాడు. ఆందోళన, భయం, తొట్రుపాటు కలిపి చేసిన మొహం తగిలించుకున్నాడు.

ఏదో పనున్నట్టు — తడబడుతూ నడుస్తూ బజార్న పోతున్నాడు. క్రింది పెదవి కొరుక్కుంటున్నాడు.

సూర్యుడు ఉదయించాడు. వేడి కిరణాలు అతని మొహంమీద పడినై. అతను నిల్చుని తలెత్తి సూర్యునివంక చూసి "ఇవ్వాళగూడా సూర్యుడు ఉదయించాడే!" అంటూ గొణిగాడు. మళ్ళీ ఆ మాటలే గొణిగాడు.

ఆ దారినే నలుగురు మనుషులు పోతున్నారు. వాళ్ళని "నుంచోండి" అని కేక వేశాడు. వాళ్ళు ఆగిపోయారు.

వాళ్ళదగ్గరగా వెళ్ళి ఏదో రహస్యం అడుగుతున్నట్లు మెల్లగా "ఇవ్వాళగూడా సూర్యుడు ఉదయించాడే!" అన్నాడు.

వాళ్ళు తెల్లబోయి తమాయించుకుని ఒక్కసారిగా ఫక్కున నవ్వి "పిచ్చివాడురా" అని సాగిపోయారు.

ఇతను గతుక్కుమన్నాడు. తను పిచ్చివాడా? పిచ్చివాడు తనకు మల్లేనే వుంటాడా? తనకుమల్లే పిచ్చివాడుంటాడా? పిచ్చివాడికిమల్లే తనుంటాడా? అవును:

పెళ్ళాం చచ్చిపోయింది. చొక్కా చిరిగిపోయింది. గడ్డం పెరిగిపోయింది. జుట్టు ఎదిగిపోయింది. ఒళ్లు వొణికిపోతోంది.

తను పిచ్చివాడికిమల్లే వుండడూ?
పిచ్చివాడికిమల్లే తనుండడూ?
ఉంటాడు తప్పకుండా ఉంటాడు.

అతను గొణుక్కుంటూ రోడ్డుపక్కనేవున్న పాడుబడిపోయిన బావిమీద కూర్చున్నాడు. గొణుక్కుంటున్నాడు. మధ్యమధ్య సన్నగా నవ్వుకుంటున్నాడు.

అలా ఎంతసేపు కూర్చున్నాడో అతనికే తెలియదు.

ఉండుండి ఒక్కసారి లేచి నిల్చున్నాడు. అతని తలమీద సూర్యుడు మిటమిట లాడుతున్నాడు. అతని ఉదరంలో ఆకలి నకనక లాడుతోంది. అతనికి ఆకలవుతోందని తెలిసింది. కాని కాసేపటికి ఆ సంగతి మర్చిపోయాడు.

అతను ఏదో ఆలోచించినట్లు తల పైకెత్తి అకస్మాత్తుగా గబగబా నడవటం మొదలుపెట్టాడు తల వొంచుకుని.

అలా అతను నడచి జనన మరణ రిజిస్ట్రారు గారి ఆఫీసుకు చేరుకున్నాడు.

అతను ఆఫీసు మెట్లు యెక్కుతుండగా లోపల ఎవరో యింకొర్ని అడుగుతున్నారు: "ఇవ్వాళ తారీఖు పద్ధాలుగు కాదూ" అని.

ఆ మాటలు యితనికి వినపడినై. వెంటనే ఇతను గబగబా లోపలికిబోయి అక్కడున్న వ్యక్తిని చూసి "అవునయ్యా ఇవ్వాళ పద్ధాలుగో తారీఖు. ఇవ్వాళే నా భార్యకు పద్ధాలుగో కాన్పు. నాకు పద్ధాలుగు రూపాయల జీతం. ఏం బాగుందా?" అంటూ గుర్గురిమాడు. ఆ వ్యక్తి తెల్లబోయి గుడ్లు మిటకరించాడు. వెంటనే యితను మొహం మార్చి "జడుసుకున్నావా! మాబాజే! ఏంచెయ్యను చెప్పు. లోకానికి పనికి రాకుండా పోయాను. ఆ బొజ్జపెంచిన వెధవ శెట్టికి పనికొచ్చాను. లెక్కలు రాసినందుకు పద్ధాలుగు రూపాయలిస్తాడు. చాలవా పొమ్మంటాడు.' అంటూ కన్నీరు పెట్టుకున్నాడు.

రిజిస్ట్రారు "ఏయ్" అని పిలిచాడు. ఇతను అటు తిరిగాడు. "ఎందుకొచ్చావు" అని గంభీరంగా ప్రశ్నించాడు రిజిస్ట్రారు.

"మరే! నేను పద్ధాలుగు రూపాయల జీతగాణ్ణి పద్ధాలుగు కాన్పులు చేసిన స్త్రీకి భర్తను..."

"ఏయ్! అధికంగా మాట్లాడకు. ఏంపని మీద వొచ్చావు?" రిజిస్ట్రారు గొంతులోనికి అధికారం ప్రవేశించింది.

"సరే! నా భార్య ఆడపిల్లను కన్నది. చచ్చిపోయానని చెప్పి రమ్మంది."

"పిచ్చిగావాక్క బయటకు నడు" రిజిస్ట్రారు కళ్ళజోడులోనుంచి చురచురా చూశాడు.

"ఒక్కమాట చెప్పి వెళ్తాను. నా భార్యపేరు పక్కనే నా పేరు గూడా రాసుకో" అని అతను బయటకు వచ్చేశాడు.

అతను గబగబా నడుస్తూ నాలుగు రోడ్లు కలిసే చోటుకు వొచ్చాడు. ఆ స్థలం జనసమ్మర్దంగావుంది. జనం అటూ యిటూ పోతున్నారు. అక్కడ క్రిందగా పారే పెద్దకాలువకు పైగా వొంతెన కట్టారు. ఆ వంతెనమీద కూర్చున్నాడతను.

అతను ఈ జనాన్ని చూశాడు. కాలవలో పారే నీటిని చూశాడు.

ఏదో మునిగిపోయినట్టు అటూ యిటూ పరుగెత్తుతున్న ఆ జనాన్ని చూసేసరికి అతనికి నవ్వు వొచ్చింది.

"ఎందుకింత సంతోషంగా వున్నారు వీళ్లు. ఏం సాధిద్దామని బ్రతుకుతున్నారు, తెలివితక్కువ వెధవలు"అని పెద్దగా నవ్వాడతను.

రోడ్డున పోతోన్నవాళ్ళు ఇతనివంక చూసి నవ్వుకుంటూ పోతున్నారు.

అతను మండిపోయాడు. వెంటనే నాలుగు బజార్లమధ్యన పోలీసు నిల్చునే దిమ్మమీదికి వెళ్ళి పెద్దగా జనాన్నుద్దేశించి "మిమ్మల్నే" అన్నాడు.

జనం అతని వంక చూశారు. "మీరంతా తెలివితక్కువ వెధవలు. ఎందుకు బ్రతుకుతున్నట్టు. పైగా గొప్పవాళ్ళను చూస్తే వెకిలిగా నవ్వుతారూ, అంట్ల వెధవలు. ఏం ఎలా అంటించానూ. బాగా అంటించా" అని పెద్దగా వికటంగా నవ్వాడు. జనంలో కొందరు నవ్వారు. కొందరు మొహాలు ముడుచుకున్నారు.

ఇంతలో ప్రక్కనే కిళ్ళీకొట్టులో కూర్చున్న పోలీసు టోపీ సర్దుకుని గబగబా వొచ్చాడు. బెదరించాలని అతనికి దగ్గరగా వచ్చి కళ్లురిమాడు.

అతను పోలీసువంక చూసి "ఒరే నాయనా! నెత్తుర్లో ముంచిన గుడ్డ నెత్తికెందుకు చుట్టుకున్నావురా, తీసెయ్యరా! నా మాట విను. నా మాటెందుకు వింటావ్. నీ పైవాడు తంతే వొచ్చి యీ దిమ్మమీద నిల్చుని చేతు లటూ యిటూ తిప్పుతూ డాన్సేస్తూ వుంటావు. పైగా నీకు గర్వం కార్లనీ బళ్ళనీ చేసైగతో నడిపిస్తున్నానని. ఇంత తెలివితక్కువ ఏబ్రాసివి ఎట్లా బ్రతుకుతావురా" అన్నాడు. జనం గొల్లుమన్నారు.

ఇంతసేపూ దిమ్మరపోయి నిల్చున్న పోలీసు దిమ్మపైకెక్కి అతన్ని క్రిందకు పడదోశాడు.

ఈ వింత చూస్తోన్న జనం అంతా చప్పట్లు కొట్టి నవ్వటం సాగించారు.

అతను క్రిందపడి లేచి దుమ్ము దులుపుకుంటూ "నవ్వండిరా! నవ్వండి. ఏం చేస్తాను! నాకు పద్ధాలుగు రూపాయల జీతం. పద్ధాలుగో సంతానం ఆడపిల్లని కని నా భార్య చచ్చిపోయింది! నవ్వాద్దంటే మానుతారా" అని పెద్దపెట్టున ఏడుస్తూ పరుగెత్తి కాలవ వొంతెన ఇనప బద్దీమీద నిల్చుని కాలవలోకి చూడటం మొదలుపెట్టాడు.

రోజూ ఆ వేళకు సూర్యుడు అస్తమించేవాడే కాని ఆ వేళ జనం అందరితో పాటు ఆయనా యీ వింతను చూస్తూ నిలబడిపోయాడు.

అతను ఇనుపబద్దీమీద నిల్చుని వెనక్కీ ముందుకూ ఊగుతున్నాడు; అంతా నోళ్ళు వెళ్ళబెట్టుకు చూస్తున్నారు పడమటి కొండలపైనుంచి సూర్యుడు ఎర్రగా చూస్తున్నాడు.

కాసేపటికి ఎవరి దారిన వారు సాగిపోయారు. సూర్యభగవానుడు పడమటి కొండల్లోకి దారితీశాడు.

---

నాకు సన్నిహితుడైన వ్యక్తి ఎవరైనా ఏ మంత్రిగిరీ లాంటి హోదానో అందుకున్నాడంటే, అతన్ని తలుచుకుని సంతోషించినా, దానివల్ల దేశ భవితవ్యం ఏమి కానున్నదో అని మహాచెడ్డ భయపడతాను.—(దిల్ వాన్)